సాక్షి
నంద్యాల
శుక్రవారం, 7, ఏప్రిల్, 2023



జల సంరక్షణకు ప్రాధాన్యం

ఓర్వకల్లు: జలవనరుల సంరక్షణకు ప్రభుత్వం సమగ్ర వాటర్ షెడ్ పథకాన్ని అమలు చేస్తోందని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. తిప్పాయపల్లెలో పనులను గురువారం ఆయన పరిశీలించారు.



'శోభా'యమానం

కర్నూలు కల్చరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం కర్నూలులో వీరహనుమాన్ విజయ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అందరికీ ఆరోగ్య భాగ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నడుం బిగించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని ఆరోగ్య పథకాలు ఇక్కడ అమలు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతోంది. 8లో

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:47
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:50
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:50
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:44

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :
యుద్ధంలో ప్రత్యర్థుల ఆయుధాల నుంచి కాపాడేందుకు కవచం ఉపయోగపడినట్లు పాపాల నుంచి మనిషిని రంజాన్ ఉపవాస దీక్ష కాపాడుతుంది. – పవిత్ర ఖురాన్

కడుపులో బిడ్డను నవ మాసాలు మోసిన గర్భిణి ప్రసవానికి ధైర్యంగా ప్రభుత్వాసుపత్రికి వెళ్తోంది. సాధారణ ప్రసవాలే లక్ష్యంగా వైద్య సిబ్బంది చొరవ తీసుకోవడం, ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించడమే ఇందుకు కారణం. పురిటి నొప్పులు మొదలవ్వగానే 108లో వెళ్లడం.. అక్కడ అనుభవజ్ఞులైన నర్సులు, వైద్యులు ఉండటంతో సాధారణ ప్రసవం కావడం.. తిరిగి తల్లీబిడ్డ వాహనంలో క్షేమంగా ఇంటికి చేరడం.. ఆతర్వాత బాలింతకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుండటంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నాయి.



సేవలు పురుడు పోయగా.. సుఖ ప్రసవాలు పెరగగా...

- ప్రభుత్వాస్పత్రుల్లో పెరుగుతున్న సుఖ ప్రసవాలు
- నవజాత శిశువుల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ యూనిట్లు
- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లతో సురక్షితంగా ఇంటికి



నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాల

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల వివరాలు..

	2021-22		2022-23	
నియోజకవర్గం	సాధారణ	సిజేరియన్	సాధారణ	సిజేరియన్
బనగానపల్లె	316	24	295	39
డోన్	1, 378	817	1,247	628
నంద్యాల	4,440	1,332	3,812	1,853
ఆళ్లగడ్డ	755	490	606	362
నందికొట్కూరు	635	-	505	-
ఆత్మకూరు	354	-	319	-
మొత్తం	7,524	2, 663	6,784	2,882

నందికొట్కూరు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంలో ప్రసవాలు అంటే ఎంతో భయంగా ఉండేది. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక చాలా మంది ఇంటి వద్దనే కాన్పయి ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరుగుతున్నాయి. గర్భిణీగా ఉన్న మహిళను మూడు నెలల నుంచే కంటికి రెప్పలా చూసుకుంటోంది. ప్రతినెల వైద్య పరీక్షలు చేయించడమే కాకుండా సుఖ ప్రసవం అయ్యేలా పౌష్టికాహారం అందిస్తోంది. ఇంటి వద్ద ప్రసవాలు ప్రమాదకరమని అవగాహన కల్పిస్తున్నారు. దీంతో గర్భిణులు ప్రసవానికి అక్కడికే వెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో 2021-22 నుంచి 2022-23 ఇప్పటి వరకు సాధారణ కాన్పులు 14,308, సిజేరియన్ కాన్పులు 5,545 చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు -నేడు ఆసుపత్రి కింద ప్రభుత్వ ఆసుపత్రిలను ఆధునికీకరించి మెరుగైన వసతులు కల్పించింది. అలాగే పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు జరిగాయి. సేవల్లో జవాబుదారీ తనం పెరిగింది. ఫలితం... ప్రభుత్వాస్పత్రుల్లో అందించే వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. అధిక మంది గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. నవజాత శిశువుల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రసవం అయిన తర్వాత తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని పరీక్షించి క్షేమంగా తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు.

రెఫర్ కేసులు తగ్గుముఖం..

నియోజకవర్గస్థాయి ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయి సదుపాయలు ఉండడంతో కర్నూలు పెద్దాసుపత్రికి రెఫర్ చేసే కేసుల సంఖ్య తగ్గింది. 90 శాతం కేసులకు ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరుగుతుండగా రెఫర్ కేసులు తగ్గుముఖం పట్టాయి. రూపాయి ఖర్చు లేకుండా కాన్పులు చేయడం జరుగుతుంది. ఫోన్ చేసిన వెంటనే 108 వాహనం వాలిపోయి ప్రభుత్వాస్పత్రికి చేరుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించే శిశువులకు డిశ్చార్జ్ సమయంలో జనన ధ్రువీకరణ పత్రం ఇస్తారు.

బాలింతలకు ఆర్థిక సాయం..

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన ప్రతి మహిళకు ప్రభుత్వం ఆర్థిక సాయం రూ. 5 వేలు ఇస్తుంది. ఆరోగ్యశ్రీ ఆసరా కింద ప్రసవించిన ప్రతి మహిళకు రూ.4 వేలు, జనని సురక్ష యోజన స్కీం కింద రూ. వెయ్యి, అర్బన్ మహిళలకు రూ.600 ప్రభుత్వం ఇస్తుంది. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రసవించిన పతి మహిళను ఇంటి వద్ద చేర్చేందుకు ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన ప్రతి మహిళకు మూడు రోజుల పాటు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తోంది.

ఆధార్ నమోదయ్యే విధంగా చర్యలు తీసుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సాయం అందుతుంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటి వద్ద ప్రసవాల సంఖ్య కేవలం ఒక శాత్రం ఉన్నట్లు తెలుస్తోంది.



పైసా ఖర్చు కాలేదు

నేను మూడో కాన్పునకు నందికొట్కూరు ఆసుపత్రిలో చేరాను. ప్రసవానికి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుంటే కొంత మంది భయపెట్టారు. కాని ఇక్కడ కాన్పు సమయంలో వైద్య సిబ్బంది చాలా బాగా చూసుకున్నారు. గతనెల 25వ తేదీన సాధారణ కాన్పయి ఆడబిడ్డకు జన్మనిచ్చాను. పైసా ఖర్చు కాలేదు. – మాధురి కొణిదేల గ్రామం..



సులభంగా కాన్పు చేశారు

నెలలు నిండుతుండగా ముందుగానే ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకోగా తప్పనిసరిగా సిజేరియన్ చేయించుకోవాలని చెప్పారు. ఓ వైపు భయం ఉన్నా సాధారణ ప్రసవం కావాలని గత నెల 24వ తేదీన నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాను. అక్కడి వైద్యసిబ్బంది ధైర్యం చెప్పి సాధారణ కాన్పు చేశారు. మొదటి కాన్పులో మగబిడ్డకు జన్మనివ్వడం ఆనందంగా ఉంది. – పర్వీన్ మండ్లెం గ్రామం



సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత

ఇంటి వద్ద ప్రసవం తల్లీబిడ్డకు మంచిది కాదు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారు. సాధారణ కాన్పులకే అధిక ప్రాధాన్యత ఇస్తాం. పురిటినొప్పులు మొదలవ్వగానే వైద్య సిబ్బంది జాగ్రత్తలు చెబుతూ అందుబాటులో ఉండి ప్రసవం చేస్తారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టరు ఏఎస్ రాయుడు, గైనకాలజిస్ట్, నందికొట్కూరు ఆసుపత్రి

న్యూస్‌రీల్

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోండి


ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరమణ

నంద్యాల(రూరల్): ఇంటి వద్దకు వస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను జిల్లా ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. గురువారం మండల పరిధిలోని పోలూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సర్వీస్ వాహనాన్ని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల ఆరోగ్యం కోసం ఫ్యామిలి ఫిజీషియన్ వాహనాన్ని ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడం సంతోషకరమన్నారు. ఈ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల పరిధిలోని ఇళ్ల వద్దకే వచ్చి, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఐఓ ప్రభావతి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ బాలజీ, చాపిరేవుల వైద్యులు ఉదయసంధ్య, శహేలం, ఇతర ప్రొగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

244 మంది విద్యార్థుల గైర్హాజరు

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లాలో గురువారం 125 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 244 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు జిల్లాలోని 22,638 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 22,394 మంది హాజరయ్యారన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరీక్షల అబ్జర్వర్ నరసింహారావు 8 కేంద్రాలను, డీఈఓ అనురాధ ఐదు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 32 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళాలు


విజయవాడకు చెందిన దాతకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిసుస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఏలూరుకు చెందిన గుట్ట సోమసూర్యబ్రహ్మం రూ.1,01,116, ఒంగోలుకు చెందిన డి.రామకృష్ణ రూ.1,01,116, విజయవాడకు చెందిన ఏలేశ్వరపు రామకృష్ణ ప్రసాద్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు, జ్ఞాపికను అందజేశారు.

రెండో ప్రసవానికీ ప్రోత్సాహక నగదు

కర్నూలు(హాస్పిటల్): ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం కింద ఇకపై రెండో ప్రసవానికీ ప్రోత్సాహక నగదు అందించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు మొదటి ప్రసవానికి మాత్రమే గర్భవతి ప్రసవించి బిడ్డకు టీకాలు వేయించే నాటికి ఆమె ఖాతాలో రూ.5వేల మొత్తాన్ని జమ చేస్తున్నారు. కాగా ఇప్పుడు రెండో ప్రసవానికి కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే రెండో సంతానంలో ఆడపిల్ల జన్మిస్తేనే పథకం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల మేరకు దశల వారీగా నగదును ఆమె ఖాతాలో జమ చేయనున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


వంద పడకల ఆసుపత్రి నిర్మాణం గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి బుగ్గన

డోన్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో కలిసి మంత్రి బుగ్గన గురువారం పరిశీలించారు. రూ.30 కోట్లతో చేపట్టిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి భవన సముదాయం, రూ.9కోట్లతో చేపట్టిన కూరగాయల మార్కెట్, రూ.7.20 కోట్లతో చేపట్టిన మునిసిపల్ పరిపాలన భవనం, రూ.4.46 కోట్లతో చేపట్టిన క్లబ్ హౌస్, రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఆర్అండ్‌బీ వసతిగృహం పనులను మంత్రి పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్టుపసాద్, కౌన్సిలర్లు ఉమామహేశ్వరి, బోయ సుమలత సురేష్, సుకన్య, రైల్వే నాగేంద్ర, సుంకన్న, కోఆప్షన్ సభ్యులు రఫి, కుమ్మరి రాజు, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ డీఈ ప్రసాద్, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజల్లోకి...


ఆత్మకూరులో గృహ సారథులకు కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా

కర్నూలు(రాజ్‌విహార్): అధికారంలోకి వచ్చాక తమ ప్రభుత్వం చేసిన మంచి పనులను, పథకాలను వివరించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లనుంది. 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' అనే పేరుతో శుక్రవారం నుంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. వార్డు కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. సర్వే చేసి వారి అభిప్రాయాలు స్వీరించి మరింత మెరుగైన పాలన అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. జగనన్న ప్రభుత్వంపై టీడీపీ, జనసేన చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలను వివరించనున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

10లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని రబీ రైతులు ఈ నెల 10వ తేదీలోగా ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 4.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కాగా 3.94 లక్షల ఎకరాలకు సంబంధించి (96.54 శాతం) రైతులు ఈ కేవైసీ చేయించుకోగా మిగిలిన రైతులు కూడా గడువులోగా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సీహెచ్‌సీ పథకానికి సంబంధించి రెండవ విడతలో 147 ఆర్బీకే కేంద్రాల పరిధిలో రైతులు రుణాలు పొందవచ్చునని, ఇందులో 40 శాతం సబ్సిడీ, 10 శాతం రైతులు చెల్లిస్తే.. మిగిలిన 50 శాతం బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. ఈనెల 25వ తేదీలోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి ఆర్బీకేకు ఒక సీహెచ్‌సీ గ్రూపు ఏర్పాటు చేసి ఆ గ్రూపుకు సబ్సిడీ కింద కిషాన్ డ్రోన్ అందజేస్తామన్నారు.

విజయ డెయిరీ టర్నోవర్ రూ.240 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): విజయ డెయిరీ (కర్నూలు మిల్క్ యూనియన్) టర్నోవర్‌ను రూ.160 కోట్ల నుంచి రూ.240 కోట్లకు పెంచినట్లు చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కర్నూలులోని విజయ డెయిరీని సందర్శించారు. డెయిరీ అభివృద్ధి, పాలు, పాల ఉత్పత్తుల సరఫరాపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బోనస్ కింద రెండేళ్లలో పాల ఉత్పత్తిదారులకు రూ.7 కోట్లు, కార్మికులకు రూ.1.50 కోట్లు ఇచ్చామన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాల సేకరణపై లీటరుకు రూ.8 వరకు ధరను పెంచినట్లు చెప్పారు. పాల సేకరణను రూ.60 వేల లీటర్ల నుంచి 90 వేల లీటర్లకు పెంచినట్లు వివరించారు. కర్నూలు మిల్క్ యూనియన్‌లో సభ్యత్వం పొందిన వారు పాడిపశువులు కొనుగోలు చేస్తే 20 శాతం డెయిరీ ద్వారా సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు డెయిరీ మేనేజర్ విజయకుమార్, మార్కెటింగ్ మేనేజర్ లింగస్వామి పాల్గొన్నారు.



పార్వేట గుర్రంపై రంగనాథుడి విహారం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు గురువారం శ్రీ లక్ష్మీ రంగనాథస్వామి వారు పార్వేట గుర్రంపై విహరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పార్వేట గుర్రంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారిని పాత రంగస్వామి దేవాలయం వద్దకు తీసుకెళ్లి.. అక్కడ పార్వేట గొర్రెను వదిలిపెట్టడంతో పట్టుకొనేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం పాత రంగనాథస్వామి వారికి పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా స్వామి వారిని ఆలయానికి చేర్చారు. భక్తుల పార్వేట పద్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి.

ఉపాధి కూలీలకు అదనపు అలవెన్స్ మంజూరు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిని కోరిన కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని చెంచుగూడేల్లో పని చేస్తున్న కూలీలకు 30 శాతం అదనపు అలవెన్స్‌లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డిని కోరారు. గురువారం విజయవాడలోని ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ రంగాలు, గృహ నిర్మాణంలో లేఅవుట్ల వారీగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 32 చెంచు గూడేల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గతంలో ఐటీడీఏ సంస్థ అడ్వాన్స్ రూపంలో వేతనాలు చెల్లించడంతో పాటు 30 శాతం అదనపు అలవెన్స్‌లు ఇచ్చేదని, అదే రీతిలో వేతనాలు చెల్లించాలని కూలీలు కోరుతున్న నేపథ్యంలో అదనపు అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు 30 శాతం అలవెన్స్ ఇచ్చేందుకు పరిశీలిస్తామని జహహర్‌రెడ్డి చెప్పారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద 408 గ్రామ పంచాయతీలకు గాను 302 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు సిద్ధం అయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.50 లక్షలు విడుదల చేయాలని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అక్కమహాదేవి జయంత్యుత్సవం


ఆలయ ప్రాంగణంలో అక్కమహాదేవికి ప్రత్యేకపూజలను నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో గురువారం అక్కమహాదేవి జయంత్యుత్సవాన్ని శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు, ఈఓ ఎస్. లవన్న తదితరులు అక్కమహాదేవి విగ్రహానికి జల, క్షీరాభిషేకాలతో పాటు పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం భ్రామరీకళావేదికపై డాక్టర్ ఎం. మహంతయ్య అక్కమహాదేవి జీవిత చరిత్ర విశేషాలు వివరించారు. 12వ శతాబ్దంలో కన్నడ ప్రాంతాన శివశరణులుగా ప్రసిద్ధిపొందిన మహాభక్తులలో అక్కమహాదేవి ఒకరన్నారు. శ్రీశైల మల్లికార్జునిపై ఎన్నో వచనాలను చెప్పారని, సంస్కృత, కన్నడ భాషల్లో ఆమె ఎంతో ప్రవీణురాలన్నారు. ఈమె వచనాలలో మధుర భక్తే కాకుండా, జ్ఞాన, భక్తి, వైరాగ్యాలకు సంబంధించిన ఎన్నో అంశాలు కనిపిస్తాయన్నారు. శ్రీశైల మల్లికార్జునుడిలో ఐక్యం కావాలనే చిరకాలవాంఛతో అక్కమహాదేవి చివరి రోజుల్లో శ్రీశైలంలోనే గడిపారని, ఇక్కడి గుహల్లో కొంతకాలం తపస్సు చేసి, సమీపంలోని కదళీవనంలోనే సిద్ధి పొందారని చెప్పారు.



ముద్దుగుమ్మలు.. ముసిముసినవ్వులు

సినీ తారలు అనసూయ, హెబ్బా పటేల్ కర్నూలు నగరంలో గురువారం కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సందడి చేశారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పాటు తమ సెల్‌ఫోన్లలో ఈ అపురూప దృశ్యాలను బంధించేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ బుల్లితెర నుంచి సినిమాల్లోకి వచ్చిన తర్వాత చాలా బిజీగా ఉంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 8 సినిమాల్లో నటించేందుకు అగ్రిమెంట్లు కుదిరాయన్నారు. రంగమ్మ అత్త క్యారెక్టర్‌తో పాటు రంగమార్తాండ సినిమాలో ప్రదర్శన తనకు వ్యక్తిగతంగా ఎంతో పేరు తెచ్చిపెట్టాయన్నారు. ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ మరువలేనన్నారు. – కర్నూలు(టౌన్)

క్లుప్తంగా

విద్యార్థుల మధ్య ఘర్షణే తప్ప ర్యాగింగ్ కాదు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఇటీవల ఎలాంటి ర్యాగింగ్ జరగలేదని విచారణ కమిటీ నిర్ధారించింది. ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణను ర్యాగింగ్‌గా భావించారని పేర్కొన్నారు. గురువారం కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కమిటీ విచారణ చేసింది. సభ్యులుగా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడి డాక్టర్ శ్రీరాములు, ఫార్మకాలజి హెచ్‌వోడి డాక్టర్ విజయభాస్కరరెడ్డి, జనరల్ సర్జరి ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల ఉన్నారు. వీరు బాధిత, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను పిలిపించి విచారణ జరిపారు. ఇది ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణగా నిర్ధారణ అయ్యిందని కమిటీ తేల్చింది. ఇదే విషయాన్ని యాంటీ ర్యాగింగ్ కమిటీలో చర్చించి విద్యార్థులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్ ప్రకటించారు.

అనాథ చిన్నారులకు రూ.4వేల ఆర్థిక సాయం

కర్నూలు(రాజ్‌విహార్): అనాథ చిన్నారులకు రూ.4వేల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కర్నూలు ఇన్‌చార్జి పీడీ ఉమా మహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య కింద ఈ సాయం అందిస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 15వ తేదీలోపు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం లేదంటే సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3,811	రూ. 7,291
పొద్దుతిరుగుడు	రూ. 2,609	రూ. 4,769
ఆముదం	రూ. 1,089	రూ. 5,621
వాము	రూ. 1,007	రూ. 21,011
ఉల్లి	రూ. 300	రూ. 815
ఎండు మిర్చి	రూ. 3,099	రూ. 32,699
శనగలు	రూ. 2,709	రూ. 4,979
కందులు	రూ. 3,400	రూ. 8,009
మొక్కజొన్న	రూ. 1,711	రూ. 2,002
మినుములు	రూ. 4,759	రూ. 7,390

అందరికీ ఆరోగ్య భాగ్యం

- ఆ దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- విప్లవాత్మక పథకాలతో విశేష ఆదరణ
- నేడు ప్రపంచ ఆరోగ్య దినం


చిన్నారి ఎత్తు కొలుస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఆస్తిపాస్తులు లేకపోయినా ఆరోగ్యంగా ఉంటే చాలనే ధోరణి నేడు నెలకొంది. ఫలితంగా ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. వ్యాయామంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఇందుకోసం ఖర్చుకు వెనుకాడటం లేదు. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా అందరికీ ఆరోగ్యం అనే నినాదాన్ని తీసుకొచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎప్పుడో అద్భుతమైన అడుగులు వేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నడుం బిగించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని ఆరోగ్య పథకాలు ఇక్కడ అమలు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతోంది. ఈ నెల 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై ప్రత్యేక కథనం.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అందులో 20 కేంద్రాలు 24 గంటల పాటు పనిచేస్తున్నాయి. ఇవి గాక ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ సర్వజన వైద్యశాల, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐదు రక్తనిల్వ కేంద్రాలు, ఏడు బ్లడ్‌బ్యాంకులు పనిచేస్తున్నాయి. వీటన్నింటి ద్వారా వైద్య సిబ్బంది ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లున్నారు. ఇందులో పనిచేసే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు మంచి వైద్యసేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్నారు. గత సంవత్సరం జిల్లాలో 46,447 మంది గర్భిణిలు నమోదు కాగా 39,946 మంది ఆసుపత్రుల్లో ప్రసవించారు. మిగిలిన వారందరూ ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రసవించారు.

వ్యాధుల నిర్ధారణ పరీక్షలు

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ సేవలో భాగంగా ఎన్‌సీడీ సర్వే జిల్లాలో చేపడుతున్నారు. ఇందులో భాగంగా 17,47,017 మందికి హెల్త్ ఐడీ జనరేట్ చేసి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 39,694 మందికి రక్తపోటు, 28,391 మందికి షుగర్, 150 మందికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాటు 37,810 మంది వృద్ధులకు ఆరోగ్యసేవలు అందించారు. 4,177 మందికి ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించగా 363 మందికి వ్యాధిలక్షణాలు కనిపించాయి.

రక్తహీనత నివారణ దిశగా...

రక్తహీనత నివారణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా 2,19,341 మంది పాఠశాల విద్యార్థులకు 1,88,483 మంది అంగన్‌వాడీ పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. కడుపులో నులిపురుగుల నివారణలో భాగంగా 6,08,326 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

అందరికీ కంటి వెలుగు

డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 4,351 పాఠశాలల్లో 6,73,728 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 37,329 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 14,525 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 164 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. వీరితో పాటు 97,589 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించగా 29, 475 మందికి దృష్టిలోపాలున్నట్లు గుర్తించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇందులో 21,963 మందికి క్యాటరాక్ట్ కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.

ప్రాణాలు పోస్తున్న ఆరోగ్యశ్రీ

జేబులో రుపాయి లేని వారు కూడా ఆరోగ్యశ్రీ కార్డు వెంట పెట్టుకుని వెళితే ఎంత పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి అయినా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఆరంభం నుంచి 2,66,291 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.633.617కోట్లు ప్రజలు లబ్ధిపొందారు. గత ఆరు నెలల్లో 1,76,708 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.374.65కోట్ల లబ్ధి చేకూరింది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ సేవలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే వారికి ఇచ్చే ఆరోగ్య ఆసరా జిల్లాలో 73,652 మంది ఉన్నారు. వీరి ఖాతాలో రూ.37.95కోట్లను జమ చేశారు.


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా బాలింతను ఇంటికి చేర్చిన దృశ్యం (ఫైల్)

108 సేవలు

జిల్లాలో 108 ద్వారా అంబులెన్స్ వైద్యసేవలు, 104 ద్వారా ఊళ్లోకే సంచార వాహన వైద్యసేవలు, 102 ద్వారా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు(గర్భిణిని ఇంటి వద్దకు దింపే కార్యక్రమం) దిగ్విజయంగా కొనసాగుతోంది. దాదాపుగా ప్రతి మండలానికి ఒక వాహనం లెక్కన వాహనాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు కొనసాగిస్తున్నారు.

అందుబాటుల్లో టెలిమెడిసిన్

ఎక్కడో గ్రామాల్లో ఉన్న ప్రజలు జిల్లా కేంద్రాలకు వచ్చి వైద్యసేవలు అందుకునే అవసరం లేకుండా వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్స్‌లు, పీహెచ్‌సీల్లోనే టెలిమెడిసిన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో టెలిమెడిసిన్ హబ్‌ను ఏర్పాటు చేసి అక్కడ స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. వీరు హెల్త్‌క్లినిక్, పీహెచ్‌సీల నుంచి వచ్చే టెలికాల్స్‌కు టెలిఫోన్, వీడియో కాల్స్ ద్వారా సమాధానాలు ఇస్తూ అక్కడి నుంచే రోగులకు ఆన్‌లైన్ వైద్యం అందిస్తున్నారు.

ఆరోగ్య అవగాహన పెంచుకోవాలి



కోవిడ్ లాంటి వైరస్‌లు మనదరిచేరకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. కానీ సాధారణ ప్రజలు బద్ధకం వల్ల వ్యాయామం చేయక ఊబకాయం, నీరసం వంటి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ కనీసం ఒక గంటపాటు వ్యాయామం చేయాలి. దీనివల్ల మధుమేహవ్యాధిగ్రస్తులకు చాలా ఉపశమనం లభిస్తుంది. అంతేగాకుండా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. దీనికితోడు ప్రజలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు అవగాహన చేసుకోవాలి.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

అప్రమత్తంగా ఉండాలి



ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వం సూచించిన నియమాలను తప్పకుండా పాటించాలి. గతంలో వచ్చిన ఈ మహమ్మారి వల్ల అనేక మంది చనిపోవడం మనం చూశాం. అలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులు రావద్దంటే మనం జాగ్రత్తలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–డాక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్, కర్నూలు

ఇంటివద్దకే 'ఫ్యామిలీ ఫిజీషియన్'

గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని గత సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభించింది. జిల్లాలో మొత్తం సచివాలయాల పరిధిలో వీటి సేవలను అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించిన దినాల్లో నెలలో రెండుసార్లు వైద్యాధికారులు ఆరోగ్య సంచార యూనిట్(104) ద్వారా 25 మండలాల్లోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోకి వెళ్లి సేవలందిస్తున్నారు. ఇందులో మొత్తం 67 రకాలైన మందులు ఇవ్వడంతో పాటు 67 రకాల పరికరాలతో వైద్యసేవలు అందిస్తున్నారు. 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి 12 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. చిన్న చిన్న వ్యాధులకు అక్కడే వైద్యం చేస్తుండగా వారితో సాధ్యం గాని వ్యాధులకు జిల్లా, బోధనాసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు.

ఆర్‌బీకేల్లో భూసార పరీక్షలు


రైతు భాష్యం నాగరాజును సన్మానిస్తున్న డీఏఓ వరలక్ష్మి, తదితరులు

వెల్దుర్తి: రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకేల్లో) భూసార పరీక్షలు చేస్తున్నారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మంచి దిగుబడులు రావాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో రైతులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. లాభసాటి పంటల సాగుపై చర్చించారు. వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. రెండో పంటగా కొర్రను సాగు చేసి ఎకరానికి 10 క్వింటాళ్లపైగా దిగుబడి సాధించిన రైతు భాష్యం నాగరాజును అతని పొలంలోనే సన్మానించారు. చిరుధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. డీపీడీ శ్రీలత, పత్తికొండ(ఆర్) ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ అక్బర్‌బాషా, వీహెచ్‌ఏ అనిల్, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకుడు అనంతరెడ్డి పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకు వైద్య సేవలు


కలెక్టరేట్ నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా అధికారులు

నంద్యాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకు వైద్య సేవలు అందుతాయని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం పల్నాడు జిల్లా చిలుకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామ బహిరంగ సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లైవ్ ద్వారా జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫరుల్లా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రభావతి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ వరప్రసాద్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో విజయవంతం చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా వైద్యాధికారులకు కేటాయించిన గ్రామాల్లోనే నివాసం ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు.

ఏడుగురు డిగ్రీ విద్యార్థులు డిబార్

కర్నూలు సిటీ: డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. గురువారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 4,293 మంది విద్యార్థులకు గాను 3,936 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,736 మంది విద్యార్థులకుగాను 2,528 మంది హాజరైనట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం టెన్త్ పరీక్షలకు 15 మందికి గాను 13 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 728 మందికి గాను 672 మంది హాజరయ్యారు.

నేడు జిల్లాకు పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ

కర్నూలు సిటీ: పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ నేడు(శుక్రవారం)జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లను విజిట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం జిల్లాలో స్కూళ్లను తనిఖీ చేయనున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఖరారు అయ్యిందని తెలియడంతో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు తమ స్కూళ్లలో అన్ని రకాల రికార్డులను సిద్ధం చేసుకుంటున్నారు. టీచర్లు పాఠ్యప్రణాళికలతో పాటు టీచర్ డైరీలను సైతం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

వెబ్‌ల్యాండ్ 2.0కి మారిన తొలి జిల్లా కర్నూలు

కర్నూలు(సెంట్రల్): వెబ్ ల్యాండ్ నుంచి వెబ్ ల్యాండ్ 2.0 పోర్టింగ్ మారిన తొలి జిల్లా కర్నూలు అని చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వేలో మే 20 నాటికీ సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభం


దుస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య,


ప్రారంభమైన కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్

కర్నూలు(టౌన్): స్థానిక జిల్లా పరిషత్తు ఎదురుగా ఉన్న అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, మైపర్ సంస్థల అధినేత ఆదిమూలపు సతీష్, సినీ తారలు అనసూయ, హెబ్బ పటేల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుకూరి ఫ్యామిలీ షాపింగ్ మాల్ చైర్మన్ వెంకట సత్యనారయణ మాట్లాడారు. కందుకూరి షాపింగ్ మాల్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సరసమైన ధరలకే అన్ని వర్గాల ప్రజలకు అవసరమయ్యే వస్త్రాలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరి షాపింగ్ మాల్ వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని హత్యాయత్నం

బొమ్మలసత్రం: అప్పు చెల్లించడం లేదని ఓ వ్యక్తి ఇద్దరి వ్యక్తులను కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన నరేంద్ర, ఈశ్వర్‌లు అన్నదమ్ములు. ఈశ్వర్ పొలం సాగు కోసం అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు వద్ద కొన్నాళ్ల క్రితం రూ.50 వేలు అప్పుతీసుకున్నాడు. కాగా అప్పు చెల్లించమని ఈశ్వర్ గురువారం రామాంజనేయులు నిలదీయగా.. కొంత సమయం కోవాలని కోరాడు. అయినప్పటికీ రామాంజనేయులు ఇప్పుడే ఇవ్వాలని పట్టుబట్టడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో రామాంజనేయులు తన వద్ద ఉన్న కత్తితో ఈశ్వర్‌పై దాడి చేశాడు. కాగా తమ్ముడిని కాపాడేందుకు పక్కనే ఉన్న నరేంద్ర అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఇద్దరిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

ఏపీలో మీడియాకు విస్తృత స్వేచ్ఛ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

శ్రీశైలం టెంపుల్: ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో మీడియాకు విస్తృత స్వేచ్ఛ ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం స్థానిక అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టులు రచించిన పుస్తకాలను గ్రంథాలయ సంస్థ కొనుగోలు చేసేందుకు తమ అభ్యర్థన మేరకు అంగీకరించారన్నారు. రాష్ట్రంలోని సీనియర్ జర్నలిస్టులను వారి స్వగృహలకే వెళ్ళి యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు సన్మానిస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్టులు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే అధికారులను సంప్రదించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 2022–23 సంవత్సరంలో జర్నలిస్టులకు ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.2.21కోట్లు ఖర్చు చేసి నగదు రహిత వైద్యసేవలు అందించిందని కొమ్మినేని తెలిపారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జీఓ 38 జారీ చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న బస్‌పాస్‌ల కొనసాగింపునకు సమాచార శాఖ ఆర్టీసీ అధికారులకు లేఖ రాసినట్లు కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారన్నారు. సమావేశంలో ప్రెస్ అకాడమీ సెక్రెటరీ ఎం.బాలగంగాధర తిలక్, శ్రీశైల దేవస్థానం పీఆర్వో టీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి దుకాణదారులు సహకరించాలి

- 142 తాత్కాలిక దుకాణాలకు నేడు మళ్లీ వేలం
- పాల్గొనకపోతే కోర్టు ఉత్వర్వుల మేరకు బహిరంగ వేలం
- రూ.75 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం
- శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.లవన్న


మీడియాతో మాట్లాడుతున్న దేవస్థాన ఈఓ ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అభివృద్ధికి దుకాణదారులు సహకరించాలి దేవస్థాన ఈఓ ఎస్.లవన్న కోరారు. గురువారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రూ.75 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని త్వరలో పనులు చేపడుతామన్నారు. దేవస్థాన పరిపాలన కార్యాలయం ఎదురుగా, గంగాధర మండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు ఉన్న తాత్కాలిక దుకాణాలకు వేలం వేసి వారికే కేటాయించాలని కోర్టు ఆదేశించగా గురువారం వేలం నిర్వహించారు. కాగా ఒకరు మాత్రమే పాల్గొనగా దేవస్థాన అధికారులు శుక్రవారం కూడా వేలంలో పాల్గొనేలా అవకాశం కల్పించారు. శుక్రవారం బ్యాంకులకు సెలవు కావడంతో డిపాజిట్‌ను నగదు రూపంలో అనుమతించేందుకు దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు దేవస్థాన మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థాన పరిపాలన భవనానికి ఎదురుగా ఉన్న దుకాణాల స్థానంలో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో ఆయా దుకాణాలను తొలగించాలని నిర్ణయించామన్నారు. అలాగే క్షేత్రానికి తరచూ వీవీఐపీలు వస్తున్న తరుణంలో భద్రతా కారణాల దృష్ట్యా గంగాధర మండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు ఉన్న తాత్కాలిక దుకాణాలను తొలగించాలని జిల్లా ఎస్పీ తమ దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. స్థానిక వ్యాపారులు నష్టపోకూడదని దేవస్థానం అన్నివిధాల ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని, వ్యాపారులు కూడా దేవస్థాన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని దేవస్థానానికి సహకరించి వేలంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వేలంలో పాల్గొనకపోతే ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్ణయిస్తామమన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ హెచ్.జి. వెంకటేష్, రెవెన్యూ ఏఈవో శ్రీనివాసరెడ్డి, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, సీఎస్‌వో అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం

- జిల్లాలో రెండు కేంద్రాల ఏర్పాటు
- ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు


హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

కర్నూలు సిటీ: జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కర్నూలులోని నందికొట్కూరు రోడ్డు, దూపాడు సమీపంలోని రెండు డిజిటల్ ఐయాన్ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లలో విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. మొదటి రోజు 1,300 మంది విద్యార్థులు హాజరయ్యారు. అడ్మిట్ కార్డుతో పాటు, ఫొటో ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, వాటర్ బాటిల్, బాల్ పాయింట్ పెన్నును మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ప్రతి విద్యార్థిని తనిఖీలు చేసి కేంద్రాల్లోకి పంపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12వ తేదీలోపు పరీక్షలు ముగిసేవి. అయితే మొదటి విడత కంటే రెండో విడతకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో షెడ్యూల్‌లో రిజర్వ్‌లో ఉన్న 13, 15 తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఫలితాలు ఈ నెల చివరిలోపు రానున్నాయి. ఎక్కువ పర్సెంటైల్‌ను పరిగణనలోకి తీసుకుని మెయిన్స్ పరీక్షల ర్యాంకులను ప్రకటించనున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మొదలుకానుంది.